(18వ పేజీ తరువాయి)

రోహిత్ పరుగులాంటి నడకతో వేణు చేయి పట్టుకుని..

''కంగ్రాట్స్ వేణు! నాకు చాలా హ్యాపీగా ఉంది తెలుసా? నాకు స్కూల్ ఫస్ట్ వచ్చిన దానికన్నా కూడా నీకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం ఎక్కువ హ్యాపీగా ఉంది'' అన్నాడు రోహిత్.

ఊహించని పరిణామానికి సునీతకు కళ్ల చీకట్లు కమ్మినట్లయి పడిపోబోయింది. అది ముందుగా చూసిన తులసి పరిగెత్తుకుంటూ వచ్చి పడకుండా పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టింది. మాధవ్, రోహిత్ కూడా సునీతను చూసి కంగారు పడ్డారు. వేణు అక్కడే ఉన్న మంచినీళ్ల సీసా మూత తీసి సునీత చేతికిచ్చాడు.

''సునీ! కొంచెం నీళ్లు తాగు.. అంతా సర్దుకుంటుంది'' సునీత మానసిక పరిస్థితి గ్రహించి అన్నాడు మాధవ్.

సునీత కోలుకోవడం గమనించి విలేకర్లు వారు వచ్చిన పని మళ్లీ మొదలు పెట్టారు.

''తులసి గారు! మీరు మీ అబ్బాయి గెలుపు గురించి చెప్పండి. వేణుని చదువుకో మని బాగా ఒత్తిడి పెట్టేవారా?''.. మైక్ తులసి ముందు పెట్టి ప్రశ్నించారు.

''అయ్యో! ఉన్నట్లుండి నన్ను గారు అంటున్నారు. నాకు ఏమీ తెలియడం లేదు కానీ, మా వేణు పాసయ్యాడని అర్థమైంది. నేనేనాడు వాణ్ని చదువుకోమని బల వంతం చేయలేదు. స్కూల్లో ఉచితంగా పుస్తకాలు ఇస్తారు. నోట్బులు, పెన్నులు కొన డానికి కూడా నా దగ్గర డబ్బులు ఉండవు. వాటి కోసం పొద్దున్నే లేచి ఇంటింటికీ పేపర్లు వేస్తాడు. సాయంత్రం బడి నుంచి వచ్చాక నాకు పనిలో సాయం చేస్తాడు. మిగిలిన సమయంలో పుస్తకాలు వదలడు. అయ్యో! వాడు వాడిష్టంతోనే చదువుకు న్నాడు. ఇందులో నేను చేసిందేమీ లేదు!'' చెమర్చిన కళ్లతో అన్నది తులసి.

''చాలా సంతోషం తులసి గారు! వేణు కష్టమనుకోకుండా ఇష్టపడి చదువుకోవడం వల్లనే ఇంత పెద్ద విజయం సాధించాడంటారు. ఇక వేణు మాటల్లో అతని భావాలు విందాం'' అంటూ వేణు ముందు మైక్ పెట్టాడు విలేకరి.

''సర్! నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా అమ్మ పనిమనిషిగా చాలా కష్టపడు తున్నది. తను తిన్నానని అబద్ధం చెప్పి నానమ్మకి, నాకు ఇంట్లో ఉన్నది పెట్టి తను మంచినీళ్లతో కడుపు నింపుకోవడం నేను చాలాసార్లు చూశాను. 'నువ్వు బాగా చదువు కుంటే మీ అమ్మ కష్టాలు తీరతాయి!' అని మా హెచ్ఎం గారు చెప్పారు. అప్పటి నుంచి చదువంటే ఇష్టాన్ని పెంచుకున్నాను. నేను పెద్దయ్యాక మా అమ్మను పనిమని షిగా చూడకూడదని నా కోరిక'' ఆనందబాష్పాలతో అన్నాడు వేణు.

అక్కడున్న వారందరూ వేణు మాటలకు కరతాళ ధ్వనులతో హర్షాన్ని వ్యక్తం చేసారు. సునీత మాత్రం వేణుని రెప్ప వేయకుండా చూస్తున్నది.

'ఇష్టంగా చదవడం అన్న వేణు మాట' సునీతను ఆలోచింపజేసింది. అలాగే తులసి వైపు చూసింది. ఎప్పటిలాగే ప్రశాంతంగా కనిపిస్తున్నది.

'తన కుటుంబాన్ని పోషించడమనేది ఇష్టంగా చేస్తున్నది కాబట్టే అసంతృప్తి లేదు' .. సునీతకి అప్పటివరకు తనకు తెలియని సత్యం బోధపడినట్లు అనిపించింది. క్రమేపీ ఆమె ముఖంలో చిరునవ్వు చోటు చేసుకుంది.

''మేడం! మీ ఇంట్లో పనిచేసే వ్యక్తి కొడుక్కి స్టేట్లో ఫస్ట్ ర్యాంక్ రావడం పట్ల మీ అభిప్రాయం ఏంటి?''.. సునీత దగ్గరికి వచ్చి, ఆమె ముందు మైక్ పెడుతూ అన్నాడో విలేకరి.

''పువ్వు సహజంగా వికసించాలి. బలవంతంగా రేకులు విప్పితే సహజత్వాన్ని కోల్పోతుంది. పిల్లలు వారికై వారు ఇష్టంతో చదివితే గవర్నమెంట్ స్కూల్లో చదివినా చదువు వస్తుంది. కార్పొరేట్ స్కూలే కానవసరం లేదు. ర్యాంకుల పేరుతో వారి తెలివితేటలను అంచనా వేయకూడదు. వారిని మార్కుల కోసం ఒత్తిడి చేయకూడదు. వేణు మంచి అబ్బాయి, బాధ్యతలు తెలిసిన తులసి పెంపకంలో మరింత రాణిస్తాడు. అతని భవిష్యత్తుకి మావంతు సహకారం మేము అందిస్తాం'' అంటూ మైక్ ఇచ్చేసింది సునీత.

తర్వాత అక్కడినుంచి తులసి, వేణు, విలేకర్లలతో సహా అందరూ వెళ్లిపోయారు.

సునీత గొంతులో నిజాయతీ గమనించిన మాధవ్ ఆమె భుజం మీద చేయి వేశాడు.

''ఏవండీ! మీరే గెలిచారు. ఉన్నత స్థానం చేరుకోవాలనే ఆశతో అనుబంధాలు, ఆత్మీయతలు వదిలేసి పరుగులు తీశాను. అసంతృప్తితో రగిలిపోతున్న నాకు ఇప్పుడు చల్లని గంధంపూత పూసినట్లుంది!'' అంటూ పశ్చాత్తాపంతో మాధవ్ చేయి మీద చేయి వేసింది సునీత.

''అమ్మా! ఇన్ని రోజులూ నువ్వు చెప్పావని భయపడుతూ చదువుకున్నాను. ఇక నుంచి ఇష్టపడుతూ చదువుకుంటాను'' నవ్వుతూ అన్నాడు రోహిత్.

సునీత కళ్లకు రోహిత్ వికసించిన పుష్పంలాగా కనిపించాడు.



## ఘనం.. పీవీ వనం





### ఔషధ సిరి.. ఉసిరి

ఉసిరికను 'శ్రీ ఫలం' అని కూడా అంటారు. సంస్కృతంలో దీనిని ఆమ్ల అని పిలుస్తారు. ఉసిరికాయల్లో సి విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగని రోధక శక్తిని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ , మధుమేహం, గుండె జబ్బులను అదుపు చేస్తుంది. ప్రతిరోజూ ఒక ఉసిరికాయను తింటే అన్ని రకాల పైత్యాలను తగ్గించవచ్చు. ఉసిరికాయను పొడి, ఎండబెట్టి వరుగుగా, మురబ్బాగా, నిలువ పచ్చడిగా రూపంలో వాడుకుంటాం. అలాగే ఆమ్లా ఆయిల్ రూపంలో జుట్టు ఆరోగ్యం కోసం ఉపయోగిస్తాము. అనేక సౌందర్య సాధనాల్లో ఉసిరిని ఉప యోగిస్తున్నారు. షడ్రుచుల్లో చేదు తప్ప మిగతా అన్ని రుచులు ఉసిరిలో ఉంటాయి. ఉసిరిని తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. ఉపవాస దీక్ష పూర్త యిన తర్వాత ఉసిరి ఫలం తిని దీక్షను విరమించే ఆచారం ఉంది. అందుకే 'ఉ సిరి ఔషధ సిరి' అన్నారు.

ఉసిరి దేవతా వృక్షం. ఇది ఉన్నచోట శ్రీమహాలక్ష్మి ఉంటుందని నమ్మకం. లక్ష్మీదేవి కొలువైన చోట శ్రీమహావిష్ణువు కూడా ఉంటాడు. ఉసిరి చెట్టు మూలంలో విష్ణుమూర్తి, కాండంలో శివుడు, కొమ్మల్లో బ్రహ్మదేవుడు, ఉప కొమ్మల్లో సకల దేవతలు ఉంటారని నమ్మకం. అందుకే ఉసిరికాయతో కార్తిక మాసం సమయంలో దీపం వెలిగిస్తూ ఉంటారు. ఉసిరి చెట్టు కింద తులసి మొక్కను ఉంచి పూజ చేస్తారు. ఉసిరి చెట్టు నీడలో వనభోజనాలు చేయడం ఆనవాయితీ.

చరిత్రలో ఉసిరి గురించి అద్భుతమైన ప్రస్తావన ఉంది. ఒకనాడు ఆదిశంక రాచార్యుల వారు ఒక గ్రామంలో, ఓ పేద ఇంటి ముందు భిక్ష అడుగుతారు. ఆ ఇంట్లో ఆహారం ఏమీ లేకపోవడంతో ఆ గృహిణి ఇబ్బంది పడుతుంది. ఇంట్లో ఉన్న ఒకే ఒక్క ఉసిరికాయను తీసుకొని వచ్చి, భక్తితో శంకరాచార్యుల వారికి భిక్ష వేస్తుంది. ఆ పేద గృహిణి పరిస్థితిని గమనించిన ఆదిశంకరులు మహాలక్ష్మిని స్తుతిస్తూ కనకధారా స్తోత్రాన్ని అప్పటికప్పుడు ఆశువుగా పఠిం చారు. ఆ వెంటనే లక్ష్మీదేవి ప్రసన్నమై అక్కడ బంగారు ఉసిరికల వర్షం కురి పించిందని చెబుతారు. ఒక్క ఉసిరికాయకు ఇంతటి ప్రాశస్త్యం ఉందన్నమాట!

**- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు**

**అది ఎవరు?**

(...13వ పేజీ తరువాయి)

### సమాధానం

సునీతా మేడమ్‌ది హత్య. ఎందుకంటే, మేడమ్ ఒకవేళ సూసైడ్ చేసుకొంటే కిటికీ అద్దం కూడా తెరిచే ఉండాలి. అయితే, అది మూసి ఉంది. అంటే హంత కుడు మేడమ్‌ను తోసేసి ఏమరుపాటుతో అద్దాన్ని మూసేశాడు. అలా ఇది హత్య అని రుద్ర కనిపెట్టాడు. ఇక, మొదటి నుంచి మేడమ్‌ది ఆత్మహత్య అంటూ ప్రచారం చేస్తున్న వాచ్‌మాన్ అబద్ధం చెప్తున్నాడని గ్రహించి అసలు విషయం తెలుసుకొందామనే అతన్ని అరెస్టు చేశాడు రుద్ర. విచారణలో.. బిల్డింగ్ ఓనర్ కళాధర్ తమ్ముడితో కుమ్మక్కై, మోహినీ మహల్‌ను ఓ భూత్ బంగ్లాగా చిత్రీకరించాడు వాచ్‌మాన్. ఆ భయంతో ఆ కోట్ల ప్రాపర్టీని వదిలేసి కళాధర్ వెళ్తాడనుకొని ఆయన తమ్ముడు అనుకొన్నాడు. అయితే, సునీతా మేడమ్ జోక్యం చేసుకోవడంతో ఆమెను చంపి.. దెయ్యం చంపినట్టు గోడమీద రాతలతో నమ్మించాలనుకొన్నాడు. మేడమ్‌ను హత్య చేసింది వాచ్‌మానేనని తర్వాత ఒప్పుకొన్నాడు. సీసీటీవీలో పడకుండా ఆ వాచ్‌మానే తగిన జాగ్ర త్తలు కూడా తీసుకొన్నాడు.